క్లుప్తంగా

ఎన్నిక

లింగాలఘణపురం: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ లింగాలఘణపురం మండల శాఖ అధ్యక్షుడిగా రాగల్ల ఆనంద్ ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొల్లూరి నర్సింహులు, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు నర్సింగ రమేష్ ఆధ్వర్యంలో ఎస్సీ సెల్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గట్టగల్ల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా కుంటి రాములు, కార్యదర్శిగా తూడి యాదగిరి, కోశాధికారిగా ప్యాట నాగయ్య, కార్యవర్గ సభ్యులుగా పక్కీరయ్య, రాంచందర్, జహింగీర్, యాదగిరి, లక్ష్మయ్య, స్వామిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ విజయ్‌మనోహర్, ఎంపీటీసీ భిక్షపతి, దిలీప్‌రెడ్డి, రాజశేఖర్, మోహన్, ఉప్పలయ్య, రాజిరెడ్డి, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి శుభాకాంక్షలు



రఘునాథపల్లి: రఘునాథపల్లి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రఘుపతిని బీఆర్‌ఎస్ యూత్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా వారు ఎస్సైని కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. శాంతి భద్రతల విషయంలో మరింత ఖ్యాతి వచ్చేలా చొరవ తీసుకోవాలని వారు కోరారు. ఎస్సైని కలిసిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి కొర్ర రాజేందర్‌నాయక్, జిల్లా యూత్ నాయకులు కుర్ర కమలాకర్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ జిట్టి వీరస్వామి, మడికంటి మధు, పెంతాల ఎల్లారెడ్డితోపాటు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది మోడల్ జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరానికి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వాసం వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి చెందిన ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపు ప్రవేశాలకు ఈ నెల 25 చివరి గడువని పేర్కొన్నారు. వివరాల కోసం 9908438726, 9247992045 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని మోడల్ కళాశాలలో ఇంటర్ ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దేవృక్షపల్లి శ్రీకాంత్ తెలిపారు. బాలికలకు హాస్టల్ వసతి ఉందని, ఈ నెల 25 తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని మోడల్ జూనియక్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో సాయినగర్ మల్లన్న గుడి వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై సృజన్ కుమార్ మంగళవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు కానిస్టేబుళ్లు రాజుకుమార్, జితేందర్‌లతో కలిసి పెకాట శిబిరం వద్దకు వెళ్లడంతో పారిపోతున్న వారిని వెంబడించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టణానికి చెందిన సుధాకర్, రాజశేఖర్, నర్సింహులు, లక్ష్మణ్, నర్సింహారెడ్డి, వెంకటనర్సు, రఘునాథపల్లికి చెందిన భాస్కర్ లింగాల ఘనపురం మండలానికి చెందిన సుధాకర్ అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.36,870 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



లింగాలఘణపురం: మండలంలోని నాగారంలో ఈ నెల 13న మతిస్థిమితంలేని గుర్తు తెలియని 36 ఏళ్ల వయసు గల వ్యక్తి మొటికె శ్రీశైలం వ్యవసాయ బావివద్ద అపస్మారక స్థితిలో పడి ఉండగా సర్పంచ్ భాస్కర్ 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. సదరు వ్యక్తి ఎవరికైన తెలిసినచో లింగాలఘణపురం పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

గాయపడిన బాలుడు..

కొడకండ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మండలకేంద్రానికి చెందిన ఎరుకల ఉపేందర్ తన కుమారుడు సనయ్‌గౌడ్(8)తో కలిసి బైక్‌పై నర్సింగాపురం గ్రామానికి వెళ్లి వస్తుండగా మండలకేంద్ర శివారులోని బయ్యన్న వాగు బ్రిడ్జి మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో తండ్రికి కాళ్లు విరుగగా కుమారుడి తల పగిలి తీవ్ర రక్తస్రావమై కోమాలోకి వెళ్లగా ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సనయ్‌గౌడ్ మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపించింది.

క్రీడలతో దేహదారుఢ్యం



నర్మెట: క్రీడాకారులతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



బచ్చన్నపేట: క్రీడాకారులతో ఇర్రి రమణారెడ్డి తదితరులు



లింగాలఘణపురంలో..



చిల్పూరు: క్రీడా పోటీల ప్రారంభంలో ఏసీపీ

నర్మెట: క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చాటుకోవాలని, క్రీడలతో కూడా జీవనోపాధి కలుగుతుందన్నారు. సీఐ నాగబాబు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఖాజామైనొద్దీన్, జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, సర్పంచ్ ఆమెడపు కమలాకర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గౌస్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే దేశ కీర్తి ఇనుమడిస్తుంది

యువత క్రీడల్లో రాణిస్తే దేశ కీర్తిని ఇనుమడింపజేస్తుందని ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ 2023 క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, జెడ్పీకోఆప్షన్ ఎండి గౌస్, ఎంపీడీఓ ఎండి ఖాజామొయినుద్దీన్, తహసీల్దార్ పారునంది శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి డా. గుగులోత్ వెంకన్న, వైస్‌ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, ఎంపీటీసి కళ్యాణం మురళి, సురేష్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

చిల్పూరు: యువత చెడు అలవాట్లకు లోనవకుండా పేరు ప్రతిష్టలు తెచ్చే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సీఎం కప్ 2023 మండల స్థాయి క్రీడాపోటీలను ఎంపీపీ బొమ్మిశెట్టి సరితబాలరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ విమల, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ మధుసూదన్, ఉపాధి ఏపీఓ మోహన్‌రావు, ప్రజాప్రతినిధులు, పీఈటీ ఉన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలి

లింగాలఘణపురం: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్ల ఉపేందర్‌రెడ్డి కోరారు. సీఎం కప్ క్రీడల సందర్భంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కబడ్డీని ఆయన ప్రారంభించారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్టుకు రూ.10వేలు, ద్వితీయ జట్టుకు రూ.5వేలు బహుమతి ప్రదానం చేస్తానని చెప్పారు. ఎంపీపీ చిట్ల జయశ్రీ, ఎస్సై ప్రవీణ్, ఎంపీడీఓ మల్లికార్జున్, స్థానిక సర్పంచ్ విజయ్‌మనోహర్, పీడీ కిష్టయ్య పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

కొడకండ్ల: రాష్ట్రంలో క్రీడలు, క్రీడాకారులను తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎంపీపీ జ్యోతి, ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సీఎం కప్ 2023 క్రీడలను వారు ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని ప్రదర్శించేందు కోసం ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడుతాయన్నారు. సర్పంచ్, ఎంపీటీసీలు మధుసూధన్, విజయలక్ష్మి, నసీరుద్దీన్, మార్కెట్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

బచ్చన్నపేట: యువత చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సీఎం కప్ క్రీడలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటి యువత ఆన్‌లైన్‌లకే పరిమితమవ్వుతూ అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ శరీరదారుఢ్యాన్ని కలిగి ఉండాలని అన్నారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, తహసీల్దార్ వినయలత, ఎంపీడీఓ రఘురామకృష్ణ, ఎస్సై నవీన్ కుమార్, సర్పంచ్‌లు వడ్డెపల్లి మల్లారెడ్డి, నాయకులు అంజయ్య, కృష్ణంరాజు పాల్గొన్నారు

క్రీడాకారులకు భోజన వసతి

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేటలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్ ఉచిత భోజన వసతి కల్పించారు. వ్యాయామ ఉపాధ్యాయులు రవి, మనోహర్, యాదగిరి, కుమార్, పంచాయతీ కార్యదర్శులు ప్రశాంత్, విజయ్, శ్రీకాంత్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సమాజంలో గుర్తింపు

తరిగొప్పుల: క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు వస్తుందని తహసీల్దార్ బొశెట్టి హరిప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ 2023 క్రీడాపోటీలను ఎస్సై దూదిమెట్ల నరేష్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ ప్రభుదాస్, వైస్‌ఎంపీపీ ప్రమీల, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జనగ్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ జయరావు, ఎంపీటీసీలు మధుసూదన్‌రెడ్డి, జుంలాల్ నాయక్ పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి సీఎం కప్ క్రీడలు

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడలు మంగళవారంతో ముగిసాయి. ఈ క్రీడలకు వివిధ గ్రామాల నుంచి దాదాపు 200 మంది క్రీడాకారులు హాజరుకాగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, బాక్సింగ్ తదితర క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారిని జట్లుగా ఎంపిక చేసినట్లు పీఈటీ ప్రమోద్‌రెడ్డి తెలిపారు. కాగా, పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సీఐ రాఘవేందర్ మాట్లాడారు. పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

పాలకుర్తి టౌన్: సీఎం కప్ మండల స్థాయి పోటీలో విజేతలకు మండల స్థాయి కమిటీ చైర్మన్, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు విజేతలను ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, సర్పంచ్ వీరమనేని యాకంతారావు, ఎంపీడీఈఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ బి. పాల్‌సింగ్, ఎస్సై శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: దేవరుప్పుల మండలకేంద్రంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడోత్సవాలు మంగళవారం సైతం కొనసాగాయి. ఈ సందర్భంగా ఎంపీఓ సురేష్‌కుమార్ మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కొడకండ్ల: మాట్లాడుతున్న యాకయ్య



జఫర్‌గఢ్: భోజనం వడ్డిసుస్తున్న శ్రీనివాస్



తరిగొప్పుల: పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న సీఐ రాఘవేందర్

జరిమానా

జనగామ రూరల్: మండలంలోని జనగామ–నర్మెట రహదారి వెంట భూమి చదును చేసే క్రమంలో ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన యజమాని జి.సాయికృష్ణ మొక్కలను ధ్వంసం చేశాడు. కాగా, అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి గమనించి సంబంధిత అధికారులు చర్య తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే కార్యదర్శి మధు అతనికి రూ.5వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించిన సాయికృష్ణ ధ్వంసమైన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటి సంరక్షిస్తానని తెలిపారు.

కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

జనగామ రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్న యజమాన్యాలపై చర్య తీసుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శానబోయిన మహిపాల్ అన్నారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కలెక్టర్ శివలింగయ్యకు వినతి పత్రం అందజేశారు. కోట వినోద్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, శివరాజ్, నవీన్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి



చెరువు గుంతలను పరిశీలిస్తున్న డీఈ రవీందర్

జనగామ రూరల్: మండలంలోని చీటకోడూరు గ్రామం రామప్పకుంట చెరువులో అక్రమంగా మట్టి తరలింపుపై కలెక్టర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. మంగళవారం ఇరిగేషన్ డీఈ రవీందర్, ఆర్ఐలు చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అధికారులకు విన్నవించారు. చెరువు మట్టిని తరలించేందుకు అనుమతి పత్రాలు ఇవ్వాలని మూడు రోజులుగా అడుగుతున్నా.. ఇప్పటి వరకు చూపించలేదన్నారు. సదరు కాంట్రాక్టర్ తప్పు చేసినట్లు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



మాట్లాడుతున్న రాపర్తి రాజు

జఫర్‌గఢ్: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ సమావేశం గుండెబోయిన రాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకోవాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి రాపర్తి సోమయ్య, నాయకులు కాట సుధాకర్, గుండెబోయిన రాజు, ఎండి శబాన, నక్క యాకయ్య, వడ్లకొండ సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

జనగామ రూరల్: మండలంలోని పెంబర్తిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఆత్మకూరి బాలస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మంగళవారం మృతదేహాన్ని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అంతకు ముందు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి రూ.1,75,000 ఎల్‌ఓసీని అందించారు. సర్పంచ్ అంబాల ఆంజనేయులు, ఎంపీటీసీ మూల రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం తదితరులు ఉన్నారు.

లింగంపల్లిలో..



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చిల్పూరు: మండలంలోని లింగంపల్లికి చెందిన చిలుక ఎల్లమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ ఏదునూరి రవీందర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.2వేల ఆర్థికసాయం అందజేశారు. రవీదర్, సత్తయ్య, రమేష్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

రఘునాథపల్లి: మండలంలోని గోవర్ధనగిరిలో బీఆర్‌ఎస్ నాయకుడు, రైతు దుస్స యాదగిరి (52) ఇటీవల వ్యవసాయబావి వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి గోవర్ధనగిరికి వెళ్లి యాదగిరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కడియం భరోషా ఇచ్చారు. అదే విధంగా గ్రామంలో అనారోగ్యానికి గురైన బీఆర్‌ఎస్ నాయకుడు దొనికల సైదులును కడియం పరామర్శించారు. మారుజోడు రాంబాబు, లక్ష్మయ్య, అనితశ్రీనివాస్, స్వప్నరాజు, గట్టేశం తదితరులు ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని కిరాణాషాపు యజమాని దిడ్డి సత్యం ఇటీవల డిస్క్ సమస్యతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయి ఘన్‌పూర్‌లోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. కాగా, జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి బాధితుడిని మంగళవారం పరామర్శించారు.

వీఓఏల వినూత్న నిరసన

లింగాలఘణపురం: మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం మోకాళ్లపై నిలబడి వినూత్న నిరసన వ్యక్తం చేశారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస గౌరవ వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల బీమా తదితర డిమాండ్లతో చేపట్టిన సమ్మె విజయవంతం అయ్యేంత వరకు పోరాడుతామని అన్నారు. సమ్మెలో వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి తహరాబేగం, కోశాధికారి పద్మ, నాయకులు ప్రభాకర్ ఉన్నారు.



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న వీఓఏలు

విరాళం అందజేత



బచ్చన్నపేట: మండలంలోని నారాయణపురంలో కురుమల ఆరాధ్యదైవమైన బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప మంగళవారం రూ.11,111 విరాళం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండుగలు సమైఖ్యతను పెంపొందిస్తాయన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ జంగిటి నరేష్ రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి, పరిదె కొమురయ్య, సత్తయ్య, భీమేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బేజాడి సిద్దులు, బీజేపీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అభినందనీయం



స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మండలంలోని రంగరాయగూడెంలో నిర్వహిస్తున్న దుర్గామాత ఉత్సవాలు, అక్కపెల్లిగూడెంలో బొడ్రాయి ఉత్సవాలు, శివునిపల్లిలో నిర్వహిస్తున్న శ్రీ పెద్దమ్మతల్లి మహోత్సవాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలకు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

నేటి నుంచి 29వ వార్డులో 'కంటి వెలుగు'

జనగామ: పట్టణంలోని 29వ వార్డులో నేటి (బుధవారం) నుంచి ఆరు రోజుల పాటు కంటి వెలుగు వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సామాజిక ఆరోగ్య అధికారి రెహమాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శని, ఆదివారాలు మినహా, మిగతా రోజుల్లో కంటి పరీక్షలు చేస్తామని, వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లికి పూజలు



పెద్దమ్మతల్లి గుడి వద్ద ముదిరాజ్ కుల పెద్దలతో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మతల్లి, శ్రీరేణుకా ఎల్లమ్మ 11వ వార్షికోత్సవాలు ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లిలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్సీ కడియం శ్రీహరి హాజరై పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కాగా, ముందుగా పెద్దమ్మతల్లి గుడివద్ద ఉత్సవ కమిటీ, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో అమ్మవార్ల అభిషేకాలు తదితర పూజలను చేపట్టారు. అలాగే శాసనమండలి వైస్ చైర్మన్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండా ప్రకాశ్ పెద్దమ్మతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ బూర్ల లతా, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బూర్ల శంకర్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అక్కపెల్లిగూడెంలో..

అక్కపెల్లిగూడెంలో జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠ, దుర్గామాత ఉత్సవాలకు ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మంగళవారం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దుర్గామాత దేవాలయంలో, బొడ్రాయి వద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. కాగా, బొడ్రాయి వద్ద ఉన్న పెద్దమ్మలోల్ల వద్ద ఉన్న పెద్ద డోలు తీసుకుని కడియం కాసేపు స్వయం వాయించడం అందరినీ అబ్బురపరిచింది. బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బెలిదె వెంకన్నగుప్తా, సీహెచ్.నరేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ కడుదుల జ్యోతినర్సిరెడ్డి, కొమురెళ్ళి, లింగనబోయిన శ్రీనివాస్, ఛాగల్లు సర్పంచ్ సారంగపాణి, నమిలిగొండ ఎంపీటీసీ రజాక్‌యాదవ్ పాల్గొన్నారు.

నివాళి

పాలకుర్తి: మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు గొట్టిపర్తి ఎల్లయ్య(92) మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల నాయకుడు సోమ సత్యం అన్నారు. మంగళవారం అనారోగ్యంతో మృతి చెందిన ఎల్లయ్య పార్థివదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. అశోక్‌బాబు, కొమురయ్య, వెంకన్న, సోమ నర్సయ్య, సాయిలు మల్లేష్ తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

మారోజు వీరన్న ఆశయాలను కొనసాగిద్దాం

పాలకుర్తి టౌన్: కులవర్గ జమిలి పోరాట సిద్ధాంత కర్త, బహుజన శ్రామిక పోరాటయోధుడు కామ్రేడ్ మారోజు వీరన్న ఆశయాలను కొనసాగించాలని బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పాలకుర్తి నియోజవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ నరేందర్ పవర్ అన్నారు. మంగళవారం పాలకుర్తి నియోజవర్గ కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తాలో బహుజన్ ముక్తి పార్టీ ఆధ్వర్యంలో వీరన్న వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులరిపంచారు. ఈ కార్యక్రమంలో దేవరాయ సాయిలు, ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ జాటోత్ బాలునాయక్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

దేవరుప్పుల: మహిళలు ప్రభుత్వం కల్పించే అవకాశాలను, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఎంపీపీ బసవ సావిత్రి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కడవెండిలో నిర్వహిస్తున్న మహిళల కుట్టు శిక్షణకేంద్రాన్ని ఆమె సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెల్లినలీనారెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణకు పాటుపడాలి



దేవరుప్పుల: తెలంగాణ ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకోసం జనారోగ్యసమితి కమిటీ పాటుపడాలని కమిటీ నూతన చైర్మన్, సర్పంచ్ పోతిరెడ్డి బెల్లినారెడ్డి సూచించారు. మంగళవారం కడవెండిలో జనారోగ్య సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కో చైర్మన్‌గా మండల వైద్యాధికారి రవిరాథోడ్, మెంబర్ కార్యదర్శిగా శిరీష, కార్యవర్గ సభ్యులుగా ఆరోగ్య సిబ్బంది రాజశేఖర్, శోభన తదితరులు ఎన్నికయ్యారు. ఆరోగ్య ఉపకేంద్రం అభివృద్ధికి పాటుపడాలని ప్రతిజ్ఞ చేశారు.